
వరదనీటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ, డీఎంసీ రామానుజులు రెడ్డి తదితరులు


అపార్ట్‌మెంట్ వాసులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జైసింహ

వర్షం.. వరద.. బీభత్సం!

- అర్ధరాత్రి నుంచి జలదిగ్బంధంలో అపార్ట్‌మెంట్ల వాసులు
- పరిశీలించిన సర్కిల్ 15 డీఎంసీ, అధికారులు, బీజేపీ, బీఆర్ఎస్ నేతలు
- మునిసిపల్ సిబ్బంది, హైడ్రా సిబ్బంది చొరవతో సమస్య పరిష్కారం

కవాడిగూడ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నిన్న రాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా కవాడిగూడ డివిజన్‌లోని గగన్‌మహల్‌లోని కొన్ని అపార్ట్‌మెంట్ వాసులు రాత్రి నుంచి ఉదయం వరకు జలదిగ్బంధంలోనే నరకయాతన అనుభవించారు. రాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా నాలా రిటర్నింగ్‌వాల్‌కు వర్షపునీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన రెండు రంధ్రాల నుంచి హుస్సేన్‌సాగర్ మూసీ నాలా నుంచి వరదనీరు రివర్స్ రావడం, మిగతా కాలనీల నీరు వచ్చి చేరింది. దీంతో ఏడు అపార్ట్‌మెంట్‌వాసులు రాత్రి నుంచి ఉదయం 11 గంటల వరకు నరకయాతన అనుభవించారు. కాలనీ రోడ్డులో మొత్తం మోకాళ్లలోతు నీరు ప్రవహించడంతో అపార్ట్‌మెంటువాసులు బయటకు రాకుండా కనీసం పాలు, స్కూల్స్‌కు వెళ్లే వారు అనేక ఇబ్బందులు పడ్డారు. రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో శివప్యాలెస్, జానకి, జయ, చిత్రగుప్తా, గగన్‌విహార్ అపార్ట్‌మెంట్ల వాసులు మోకాళ్లలోతు వరదనీటితో ఇబ్బందులు పడ్డారు. దీంతో వీధికి రాకపోకలు పూర్తిగా స్తంభించి పోయాయి. సమాచారం అందుకున్న ముషీరాబాద్ సర్కిల్-15 డీఎంసీ రామానుజులురెడ్డి, మునిసిపల్ డీఈ సన్ని, ఏఈ వినోద్, హైడ్రా సిబ్బంది కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ, బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకులు ముఠా జైసింహ, బీజేపీ నేతలు జి.వెంకటేష్, ఎంసీ.మహేందర్‌బాబు. బీఆర్ఎస్ నేతలు ఎన్‌డీ.సాయికృష్ణ సంఘటనా స్థలానికి చేరుకొని వరదనీటిని తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా అపార్ట్‌మెంట్ వాసులు, బీజేపీ రాష్ట్రనాయకులు ఆర్.పద్మరెడ్డి, మిగతా అపార్ట్‌మెంట్ వాసులు మాట్లాడుతూ, నాలా పూడికతీత సరిగా తీయకపోవడం వల్లే ఇలాంటి సమస్యలు వస్తున్నాయన్నారు. మునిసిపల్, హైడ్రా సిబ్బంది రోడ్డుపై ఉన్న మ్యాన్‌హోల్స్ తెరిచి, వరదనీరు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. దీంతో అపార్ట్‌మెంట్లవాసులు ఊపిరి పీల్చుకున్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సమస్య రాకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని అపార్ట్‌మెంట్ల వాసులు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నేతలను కోరారు.

ఇళ్లలోకి వరదనీరు.. తడిసిన సరుకులు

ముషీరాబాద్: ముషీరాబాద్, భోలక్‌పూర్‌లో కురిసిన భారీవర్షానికి మోకాళ్లలోతు నీళ్లు రోడ్లపై ప్రవహించడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ప్రాగాటూల్స్ చౌరస్తా నుంచి భోలక్‌పూర్ పద్మశాలి కాలనీ మీదుగా పెద్ద ఎత్తున వరదనీరు ప్రవహించడంతో వాహనాలు వరద తాకిడికి కొట్టుకుపోయాయి. ఇళ్లలోకి నీళ్లు రావడంతో నిత్యవసరాలు తడిసి ముద్దయ్యాయి. దామోదర సంజీవయ్య (డీఎస్) నగర్ నాలా పరీవాహక ప్రాంతంలో బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ పర్యటించి, బాధితులను పరామర్శించారు. జీహెచ్‌ఎంసీ ధికారులకు సమాచారం అందించి, వరదనీరు పోయేలా చర్యలుతీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, యూత్ కమిటీ అధ్యక్షుడు కేఎం.సాయి, సోషల్‌మీడియా ఇన్‌చార్జి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ప్రాగాటూల్ చౌరస్తా నుంచి భోలక్‌పూర్ మీదుగా రోడ్డుపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు


వినోభానగర్‌లో ప్రహరీకూలడంతో అటుగా వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటుచేసిన జీహెచ్‌ఎంసీ సిబ్బంది


పద్మశాలి కాలనీలో తడిసిన బియ్యాన్ని చూపుతున్న బాధితుడు


నిలిచిన నీటి సమస్యను చూపిస్తున్న బస్తీ అధ్యక్షుడు, మాజీ అధ్యక్షుడు


స్థానికులతో చర్చిస్తున్న హైడ్రా అసిస్టెంట్ డైరెక్టర్ పాపన్న, డీఎంసీ రామానుజులరెడ్డి


శ్రీరాంనగర్‌లో నిలిచిన నీటి పరిశీలిస్తున్న డీవైఎఫ్ఐ కోట రమేష్ తదితరులు


శ్రీరాంనగర్‌లో నిలిచిన నీటి పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు రమేష్ తదితరులు

వర్షపునీటిని బయటికి తరలించాలి : ఎమ్మెల్యే

రాంనగర్: శ్రీరాంనగర్ బస్తీలో నిలిచిపోయిన వర్షం నీటిని యుద్ధ ప్రాతిపదికన బయటకు వెళ్లే విధంగా హైడ్రా, జీహెచ్‌ఎంసీ అధికారులు చర్యలు చేపట్టాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ కోరారు. వరదనీటితో ఇబ్బంది పడుతున్న బస్తీని గురువారం రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారితో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. బస్తీవాసులు, బాధితులు మనోధైర్యంగా ఉండాలన్నారు. పాత పైప్‌లైన్ వ్యవస్థను ప్రైవేట్‌వ్యక్తి బ్లాక్ చేయడం వల్లనే ఈ సమస్య నెలకొందని, దీనిని వెంటనే పునరుద్ధరించాలని అధికారులకు సూచించారు. శ్రీరాంనగర్ బస్తీ అధ్యక్షుడు హరినాథ్, మాజీ అధ్యక్షుడు ఆర్.వివేక్ మాట్లాడుతూ 200 ఇళ్లు నీట మునిగితే కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు తమను పట్టించుకున్న పాపాపపోలేనదని ఆరోపించారు. తమ బస్తీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు.

డీవైఎఫ్ఐ, సీపీఎం నేతల సందర్శన

వరదనీటి ముంపుకు గురైన శ్రీరాంనగర్ బస్తీని గురువారం డీవైఎఫ్ఐ, సీపీఎం నేతల సందర్శించారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, కార్యదర్శి వెంకటేష్, సీపీఎం నాయకులు కల్లూరి రమేష్ పలువురు నేతలు బస్తీలో నెలకొన్న నీటి సమస్యపై ప్రజలను కలిశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఇలాంటి సమస్య నెలకొందని విమర్శించారు. నాయకులు జావేద్, కుమార్ పాల్గొన్నారు.


శ్రీరాంనగర్ బస్తీలో వర్షం నీటి సమస్యను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గోపాల్, కార్పొరేటర్ రవిచారి తదితరులు


శ్రీరాంనగర్‌లో నిలిచిన వరదనీరు


కమాన్ బస్తీలో నిలిచి పోయిననీరు

వరద సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు


అరుంధతినగర్‌లో పరిశీలిస్తున్న జైసింహ

చిక్కడపల్లి: వర్షపువరదనీటి వలన ఏర్పడే సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పర్యవేక్షణలో అధికారులు తక్షణ చర్యలు తీసుకుంటున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర యువనేత ముఠా జైసింహ తెలిపారు. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి గాంధీనగర్ డివిజన్‌లోని పలు లోతట్టుప్రాంతాల్లో నివసిస్తున్న పేదప్రజలను బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ముచ్చరపు రాకేష్‌కుమార్ ఆధ్వర్యంలో ముఠా జైసింహ అధికారులతో కలిసి పరామర్శించారు. బాధితులకు సాయం అందించారు.

ఆహార పొట్లాలు అందజేసిన బీజేపీ నేతలు



చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ అరుంధతినగర్ బస్తీలో బుధవారం రాత్రి కురిసిన భారవర్షానికి బస్తీ అతలాకుతలమైంది. ఈ సందర్భంగా రాత్రి బస్తీని సందర్శించడంతోపాటు గురువారం ఉదయం బాధితులకు ఆహార పొట్లాలను బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో అందజేశారు.

చిక్కడపల్లి: బుధవారం రాత్రి మూడుగంటల పాటు కురిసిన భారీ వర్షానికి వరదలో చిక్కుకున్న బైకర్‌ను యువకులు కాపాడి రోడ్డుపక్కకు తీసుకొచ్చారు.



ఆజామాబాద్‌లో కూలిన గోడ



బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఆజామాబాద్‌లోని ముషీరాబాద్ ఆర్టీసీ డిపోకు వెళ్లే దారిలో ఓ ప్రైవేట్ సంస్థకు చెందిన పాత గోడ ఉదయం కూలింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. **- రాంనగర్**

ప్రభుత్వం డివిజన్ బెంచ్‌కు వెళ్లొద్దు : ఆర్.కృష్ణయ్య


మాట్లాడుతున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

రాంనగర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 ఉద్యోగాలపై హైకోర్టు ఇచ్చిన తీర్పును వెంటనే అమలు చేసి తిరిగి పరీక్షలు నిర్వహించాలని ఎంపీ ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైకోర్టు తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం పట్టింపులకు వెళ్తూ అప్పీలుకు వెళ్లాలని ఆలోచన చేయడం సరికాదన్నారు. హైకోర్టుకు వెళ్లినా పై కోర్టుకు వెళ్లినా ఇదే తీర్పు వస్తుందని, కాలయాపన జరుగుతుందన్నారు. దీంతో నిరుద్యోగులకు తీవ్ర ఇబ్బందుల తలెత్తుతాయన్నారు. గురువారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల భరత్‌కుమార్ అధ్యక్షతన గ్రూప్-1ఉద్యోగాలపై హైకోర్టు ఇచ్చిన తీర్పు-అప్పీలకు వెళ్లాలనే ప్రభుత్వ ఆలోచన అంశంపై సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ గ్రూప్-1 పరీక్షలు వెంటనే నిర్వహించాలన్నారు.

'కార్పొరేషన్‌కు రూ.వెయ్యి కోట్లు కేటాయించాలి'

చిక్కడపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మహేంద్ర మేదర ఫైనాన్స్ కార్పొరేషన్‌కు వెయ్యికోట్లు కేటాయించి, వెంటనే చైర్మన్, పాలకమండలిని నియమించాలని, వెదురు పెంపకానికి నగర శివారు ప్రాంతంలో వెయ్యి ఎకరాలు కేటాయించాలని జంటనగరాల మహేంద్ర మేదర సంఘం అధ్యక్షుడు రేషం మల్లేష్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం చిక్కడపల్లిలోని జంటనగరాల మహేంద్ర మేదర సంఘం కార్యాలయంలో ప్రపంచ వెదురు దినోత్సవం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహేంద్ర మేదరలను ఇతర రాష్ట్రాల మాదిరిగా తమను ఎస్టీ జాబితాలో చేర్చాలన్నారు.

ప్రభుత్వాలు అన్ని విధాలుగా ఆదుకోవాలి

బర్కత్‌పుర, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వెదురు కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని మేదరి మహేంద్ర సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ కేపీ.మురళీకృష్ణ కోరారు. ప్రపంచ వెదురు దినోత్సవం సందర్భంగా గురువారం బర్కత్‌పురలో హైదరాబాద్ మేదరి మహేంద్ర సంఘం ఆధ్వర్యంలో వెదురు ఉత్పత్తుల ప్రదర్శన నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు శీలం వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మురళీ కృష్ణ ముఖ్యఅతిథిగా, సంఘం ఉపాధ్యక్షులు పుట్టా యాదగిరి, శ్రీధర్, సహాయ కోశాధికారి, పాతకోటి మహేష్, నాయకులు పాల్గొన్నారు.

ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాలలో
బీజేపీ ఆధ్వర్యంలో సేవా పక్వాడ


స్వచ్ఛభారత్ కార్యక్రమంలో రోడ్లను ఊడుస్తున్న కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్

రాంనగర్/నల్లకుంట/గోల్నాక/ముషీరాబాద్/బర్కత్‌పుర/చిక్కడపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బీజేపీ అధిష్ఠానం చేపట్టిన సేవాపక్వాడ కార్యక్రమాలలో భాగంగా గురువారం ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాలలో బీజేపీ నేతలు పలు బస్తీలు, కాలనీలు, రోడ్లలో శ్రమదానం చేసి, చెత్త, మట్టిని ఎత్తివేసి తరలించారు. ఇందులో భాగంగా బీజేపీ అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు పాశం సాయికృష్ణయాదవ్ ఆధ్వర్యంలో డివిజన్‌లోని లలితానగర్, అంబేడ్కర్ నగర్ తదితర ప్రాంతాలలో చెత్తను ఎత్తివేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కౌండిన్యప్రసాద్, ఓంప్రకాష్, కిషోర్, దర్గానర్సింగ్ రావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. రాంనగర్ డివిజన్‌లోని మేదరబస్తీలో బీజేవైఎం ముషీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ గడ్డం నవీన్ ఆధ్వర్యంలో రోడ్డును శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ నవీన్‌గౌడ్, రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు గడ్డం సతీష్, నాయకులు బాబుగౌడ్, జనార్దన్, తూడుం రాజు, జైపాల్, అరుణ్, నర్సింగ్‌రావు, రాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు. నల్లకుంట ప్రశాంత్‌నగర్‌లో సేవాపక్వాడలో చెత్తను బీజేపీ సెంట్రల్ జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు కె.లక్ష్మణ్‌కుమార్ తదితరులు ఎత్తివేసి రిక్షాలో తరలించారు. గోల్నాక డివిజన్ వీరన్నగుట్ట శివాలయ ప్రాంగణంలో బీజేపీ నేతలతో కలిసి ఆ పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ముషీరాబాద్ హజార్‌గల్లీలో రోడ్లను కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్, డివిజన్ అధ్యక్షుడు కంచి ముదిరాజ్ ఊడ్చారు. గాంధీనగర్ డివిజన్ చిక్కడపల్లి వివేక్‌నగర్‌లో నిర్వహించిన స్వచ్ఛభారత్‌లో బీజేపీ నేతలు గోపాల్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

వీహెచ్‌కు 'అలయ్ - బలయ్' ఆహ్వానం



దసరా పండగను పురస్కరించుకుని అక్టోబరు 3న ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించే అలయ్- బలయ్ కార్యక్రమానికి హాజరు కావాలని మాజీ ఎంపీ వి.హనుమంతరావును గురువారం ఆయన నివాసంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా దత్తాత్రేయను వీహెచ్ సత్కరించారు. **- రాంనగర్, ఆంధ్రజ్యోతి**

భోలక్‌పూర్‌లో విషాదం

అమీర్‌పేట/ముషీరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ బొంతల బస్తీకి చెందిన షరీఫ్ ఉద్దీన్(27) వరద నీటిలో మునిగి మృతి చెందటంతో భోలక్‌పూర్‌లో విషాదం చోటుచేసుకుంది. ఆరు రోజుల క్రితం కూతురు అనదియ పుట్టిన రోజును ఘనంగా జరిపిన షరీఫ్‌ఉద్దీన్ ఇంతలోనే అకాల మరణం చెందడం ఆ కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. భార్య సల్మా, సంవత్సరం వయసు ఉన్న కూతురు దిక్కులేని వారయ్యారు. షరీఫ్ ఉద్దీన్ కృత్రిమ మానవ అవయాలు తయారు చేసే ఓ ప్రైవేటు కంపెనీలో విధులు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గాంధీలో పోస్టుమార్టం అనంతరం ఆయన భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. గురువారం సాయంత్రం అంత్యక్రియలు జరిగాయి. కుటుంబ సభ్యుల రోధనలు అందరిని కలిచివేశాయి. షరీఫ్‌ఉద్దీన్ కుటుంబానికి రూ.25లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ డిమాండ్ చేశారు. బల్కంపేట అండర్‌పాస్ బ్రిడ్జ్‌కింద ఎలాంటి రక్షణ సూచికలు, విద్యుత్తు దీపాలు లేకపోవడం వల్లే షరీఫ్ ఉద్దీన్ మృతిచెందాడని జైసింహ ఆరోపించారు. బీఆర్ఎస్ డివిజన్ మాజీ అధ్యక్షుడు మహ్మద్‌అలీ, సీనియర్ నాయకుడు అక్లక్ హుస్సేన్ తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పేదకుటుంబానికి చెందిన షరీష్ ఉద్దీన్ కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. మాజీ కార్పొరేటర్ వాజీద్‌హుస్సేన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నర్సింగ్‌రావు వారి కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు.

25న బతుకమ్మకుంట ప్రారంభోత్సవం: వీహెచ్

రాంనగర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈనెల 25న అంబర్‌పేట నియోజకవర్గం బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లో పునరుద్ధరించిన బతుకమ్మకుంట చెరువు ప్రారంభోత్సవం, బతుకమ్మ వేడుకల కార్యక్రమాలు జయప్రదం చేసేందుకు పార్టీలకతీతంగా పార్టీశ్రేణులు కృషిచేయాలని మాజీ ఎంపీ వి.హనుమంతరావు సూచించారు. గురువారం బాగ్‌అంబర్‌పేటలోని తన నివాసంలో అంబర్‌పేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులతో ఏర్పాట్లు, ప్రజల తరలింపు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బతుకమ్మకుంట అంబర్‌పేట నియోజకవర్గానికి తలమానికంగా నిలుస్తుందన్నారు. ప్రజల చిరకాలవాంఛ నెరవేరిందన్నారు. మహిళలు ప్రతియేటా ఇక్కడ బతుకమ్మను ఆడేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేయడం కాంగ్రెస్ ఘనత అన్నారు. సీఎం కార్యక్రమం జయప్రదం చేయడానికి డివిజన్ల వారీగా పార్టీ నాయకులు సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ నెల 19న బాగ్ అంబర్‌పేట, 20న గోల్నాక, 21న నల్లకుంట, 22న అంబర్‌పేట, 23న కాచిగూడ డివిజన్లలో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అంబర్‌పేట నియోజకవర్గం ఇన్‌చార్జి డాక్టర్ రోహిణ్‌రెడ్డి, టీపీసీసీ ప్రధానకార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్, మాజీ ఫ్లోర్‌లీడర్ పి.నారాయణస్వామి, టీపీసీసీ కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు దిడ్డి రాంబాబు, పులిజగన్, ఖైరతాబాద్ జిల్లా ప్రధానకార్యదర్శి కృష్ణగౌడ్, నాయకులు రామ్మోహన్, శ్రీధర్‌గౌడ్, కె.రాజేశ్వరరావు, హరితిలక్‌సింగ్, లక్ష్మణ్, సుదాకర్, సుధాకర్ పాల్గొన్నారు.

బతుకమ్మకుంటలో అభివృద్ధి పనుల పరిశీలన

రాంనగర్: బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని బతుకమ్మకుంటలో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని హైడ్రా డీఈ మోహన్‌కు సూచించారు. బతుకమ్మ ఆడేందుకు వచ్చే మహిళలకు ఇబ్బందులు కలగకుండా తగు సహకారం అందించాలన్నారు.

ఫీజు కట్టలేదని ఇంటర్ ఇంటర్నల్ ఎగ్జామ్స్‌కు నో ఎంట్రీ

చిక్కడపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులను ఫీజు కట్టలేదనే కారణంతో ఇంటర్నల్ ఎగ్జామ్స్‌కు హాజరు కావడానికి కళాశాల యాజమాన్యం ఒప్పుకోకపోవడంతో విద్యార్థులు ఆందోళనకు దిగారు. చిక్కడపల్లి మెట్రోస్టేషన్ సమీపంలో ఉన్న ఓ ప్రయివేట్ కాలేజీలో ఇంటర్ ఫస్టియర్ చదివే పిల్లలు ఫీజు చెల్లించలేదనే నెపంతో యాజమాన్యం వారిని ఇంటర్నల్ ఎగ్జామ్స్ రాయడానికి అంగీకరించలేదు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గురువారం కాలేజీ ముందు ఆందోళనకు దిగారు. వాగ్వివాదం, తోపులాట జరిగింది. తనపై ఓ విద్యార్థి తల్లి దాడిచేశారని ప్రిన్సిపాల్ చిక్కడపల్లి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పేరెంట్స్ కూడా యాజమాన్యంపై ఫిర్యాదు చేశారని ఇరువర్గాల ఫిర్యాదును స్వీకరించి, దర్యాప్తు చేస్తున్నట్లు పీఎస్ డీఐ శంకర్ తెలిపారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- 'తులం' హామీని అమలు చేయాలి: ఎమ్మెల్యే గోపాల్

కవాడిగూడ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ లబ్ధిదారులకు సూచించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం లక్ష రూపాయలతోపాటు ఒక తులం బంగారం లబ్ధిదారులకు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయ పరిధిలో నూతనంగా మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ 186మందికి గురువారం కవాడిగూడ డివిజన్‌లోని లోయర్ ట్యాంక్‌బండ్ ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే చెక్కులను పంపిణీ చేశారు. కల్యాణలక్ష్మి పథకం కింద 77, షాదిముబారక్ పథకం కింద 109 చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ తులం బంగారం స్కీమ్ అమలు జరిగేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చందన, ఆర్ఐ నిరంజన్, ఆర్ఐ శివప్రసాద్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్యామ్‌యాదవ్, కవాడిగూడ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆర్.రాంచందర్, రాజేష్, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, శంకర్‌ముదిరాజ్, శివ ముదిరాజ్, ప్రవీణ్, దీన్‌దయాల్‌రెడ్డి, మాదవ్, శ్యామ్‌సుందర్, మహ్మద్‌అలీ పాల్గొన్నారు.


ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోపాల్, డిప్యూటీ తహసీల్దార్ చందన

కార్పొరేటర్ల నిరసన

ముషీరాబాద్ తహసల్దార్ కార్యాలయంలో జరిగిన షాదీముబాకర్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో రెవెన్యూ అధికారులు సమాచారం ఇవ్వకుండా ప్రోటోకాల్ పాటించకుండా అమానించారని కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ, ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్, రాంనగర్ కార్పొరేటర్ రవిచారి డిప్యూటీ తహసీల్దార్ చందనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో తమ ఫొటోలు లేకపోవడం పట్ల నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, లబ్ధిదారులకు ఉదయం పదిగంటలకు సమయం ఇచ్చి 11.30 గంటల వరకు ఎమ్మెల్యే ముఠా గోపాల్ వచ్చే వరకు కార్యక్రమాన్ని ప్రారంభించలేదని వారు ఆరోపించారు. అనేకమార్లు లబ్ధిదారులు. కార్పొరేటర్లు ఎమ్మెల్యే కోసం వేచి చూస్తారని కానీ ఈసారి ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఎవరినీ పట్టించుకోకుండా ఆలస్యంగా వచ్చి చెక్కుల పంపిణీ చేయడం సరికాదన్నారు. ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అధికారికంగా ఎవరూ చెప్పకుండా రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. ప్రతిసారి కార్యక్రమ వేదికపై ఏర్పాటు చేసే ఫ్లెక్సీల్లో తమ ఫొటోలు లేకుండా కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల వారు ముషీరాబాద్ డిప్యూటీ తహసీల్దార్ చందనపై ఆగ్రహం చేశారు. మరోసారి ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని వారు హెచ్చరించారు.

అనేకమందిని చైతన్యపర్చిన బోయిభీమన్న


బోయిభీమన్నకు నివాళులర్పిస్తున్న జస్టిస్ సత్యనారాయణప్రసాద్, కళా జనార్దనమూర్తి

చిక్కడపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దళితులపై అకృత్యాలను ఎండగడుతూ బోయిభీమన్న రాసిన పాలేరు నాటకం ఆనాడు ఎందరినో చైతన్యపర్చిందని విశ్రాంత డా.పి.సత్యనారాయణప్రసాద్ అన్నారు. త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా గురువారం బోయిబీమన్న యాదిలో కార్యక్రమాన్ని ఆయన జయంతిని పురస్కరించుకుని గానసభ అధ్యక్షుడు కళాజనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న జస్టిస్ పి.సత్యనారాయణ ప్రసాద్ మాట్లాడుతూ బోయి బీమన్న రాసిన గడిసెలు కాలిపోతున్నాయి సుదీర్ఘ కావ్యానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చిందన్నారు. బీమన్న ప్రతిభను గుర్తించి ఆంధ్రవిశ్వవిద్యాలయం కళాప్రపూర్ణ, కేంద్ర పద్మభూషణ్ అవార్డులను ప్రదానం చేశారన్నారు. సాహితీకిరణం సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు, సెన్సార్‌బోర్డు సభ్యులు తిరుమాణి చంద్రశేఖర్, కవి పెద్దూరి వెంకటదాసు, సంఘసేవకుడు భవాని శ్రీనివాస్ పాల్గొన్నారు.